పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

-జంట సర్కిళ్ల ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇంద్రసేన

బాలానగర్ , జూన్ 1 : చెత్త ద్వారా హాని కలిగించే పాయింట్లపై (జీవీపీ) ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని కూకట్‌పల్లి సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టారు. శనివారం కూకట్‌పల్లి సర్కిల్ పరిధి, బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడలో చాయ్ ఫర్ సఫాయి కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల ద్వారా హాని కలిగించే పాయింట్ల (జీవీపీ) తొలగింపులో భాగంగా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించేందుకు జంట సర్కిళ్ల ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇంద్రసేన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జీవీపీ పాయింట్ వద్ద చెత్తను తొలగించి ముగ్గులు వేసి అదే స్థానంలో చదరంగం ఆడి స్థానికులకు కనివిపుపు కలిగించేందుకు ప్రయత్నించారు. స్థానిక మహిళలు, సీనియర్ సిటిజన్స్‌తో కలిసి చర్చించి ఆయా ప్రాంతాల్లో తిరిగి చెత్తను డంపింగ్ చేయరాదని సూచించారు. పరిసరాల్లో చెత్తను వేయడం ద్వారా ఇతరులతో పాటు అందరకీ హాని కలుగడానికి అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ మహిపాల్‌రెడ్డి, జవాన్ నర్సింగ్, ఎస్ఎఫ్ఏ నాగరాజు, బోలా శంకర్, సమాఖ్య అధ్యక్షురాలు ఢెరి స్సా, ఆర్పీలు రాణి, లక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శనివారం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీకి పార్టీ శ్రేణులతో కలిసి తరలివెళ్తున్న ఎమ్మెల్యే గాంధీ



ట్యాంక్ బండ్ అమరజ్యోతి వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

అమరుల త్యాగం..కేసీఆర్ ఉద్యమం..

- **సాకారమైన స్వరాష్ట్ర కల..**
- **తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా .. ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యేలు గాంధీ, మాధవరం, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, నేతలు**

మియాపూర్, జూన్ 1: ఎందరో అమరుల త్యాగం, ఉద్యమ నేత, తొలి సీఎం కేసీఆర్ శాంతి ఉద్యమం వెరసి ఏండ్ల నాటి స్వరాష్ట్ర కల సాకారమైందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఏండ్ల నాటి వెనకబాటుకు గురైన రాష్ట్రం కేసీఆర్ నేతృత్వంలో కేవలం పదేండ్లలోనే అభివృద్ధి పరుగులు తీసి దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు సాధించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్ బండ్ అమరజ్యోతి వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీకి కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పల పాటి శ్రీకాంత్, జూపల్లి సత్యనారాయణ, మంజుల రఘునాథ్‌రెడ్డి, మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు సహా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే శనివారం తన నివాసం వద్ద నుంచి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన కోసం తొలి మలి ఉద్యమంలో అమరులైన ప్రతి ఒక్కరినీ స్మరించుకోవడం మనందరి బాధ్యతని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. నిధులు నియామకాలు సహా ఎంతో వెనకబడి ఉన్న తెలంగాణను తొలి సీఎం కేసీఆర్ ఎంతో పురోగతి వైపు నడిపించారన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్‌ల పార్టీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నేతలు, పాల్గొన్నారు.

- శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే గాంధీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధనలో ఎందరో తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారని, సకల జనులను శాంతియుత మార్గంలో నడిపించి కలను నిజం చేసిన నాయకుడు కేసీఆర్ అన్నారు. అన్ని రంగాలు పురోగమించి తెలంగాణ రాష్ట్రం మరింత వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.
- కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. నగరంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్ బండ్ అమరజ్యోతి వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో పాటు కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నర్సింహాయాదవ్, పండాల సతీష్‌గౌడ్, మందడి శ్రీనివాస్‌రావు, పగుడాల శిరీషా బాబురావు, ఆవుల రవీందర్‌రెడ్డి, సబీహాబేగం, మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, పగుడాల బాబురావు పాల్గొన్నారు.

గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, తదితరులు

కుత్బుల్లాపూర్ చౌరస్తా నుంచి గన్‌పార్క్‌కు వెళ్తున్న ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

ట్యాంక్ బండ్ వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ర్యాలీలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, బీఆర్ఎస్ నేతలు

వేంకటేశ్వరస్వామివారికి బంగారు కిరీటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కుటుంబ సభ్యులు

వేంకటేశ్వరస్వామివారికి స్వర్ణ కిరీటం బహూకరణ

కొండాపూర్, జూన్ 1 : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠ పాలిత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ సముదాయంలో శనివారం జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కుటుంబ సభ్యులు, కార్పొరేటర్లు మంజుల రఘునాథరెడ్డి, శ్రీకాంత్‌తో కలిసి పాల్గొన్నారు. కల్యాణ అనంతరం స్వామివారికి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి స్వర్ణ కిరీటాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంతోపాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు శ్యామల దేవి, పృథ్వీ, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రఘునా థరెడ్డి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితుల అశీర్వచనం తీసుకున్నారు. పూజల్లో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నాయినేని తులసీ రావు, మామిడాల రవీందర్‌రెడ్డి, రజాక్‌బాయ్ తదితరులు ఉన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 1

హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులుగా 3 సంవత్సరాల పాటు కొనసాగి, పదవీ విరమణ పొందిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావును శనివారం సన్మానిస్తున్న వర్సిటీ దళిత విద్యార్థి సంఘం నాయకులు

– కొండాపూర్, జూన్ 1

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు..

కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్‌పటేల్ నగర్‌లోని శ్రీలక్ష్మీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవ పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం విశ్వక్షేనారాధనం, పుణ్యాహవచనం తదితర పూజలు జరిగాయి. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 1

అస్తవ్యస్తంగా స్ట్రీట్‌లైట్ల నిర్వహణ.. పట్టపగలే వెలుగుతున్న లైట్లు

అల్లాపూర్,జూన్1: అల్లాపూర్, మోతీనగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్‌లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలుచోట్ల పట్టపగలు స్ట్రీట్‌లైట్లు వెలుగుతుండటంతో పాటు మరికొన్ని చోట్ల రాత్రిపూట పనిచేయక చీకటిగా ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్ట్రీట్‌లైట్ల సమస్య పై అధికారులు,సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మోతీనగర్ పరిధిలోని బీఎస్‌పీకాలనీ సాయిసిద్ధార్థ స్కూల్ సమీపంలో స్ట్రీట్‌లైట్లు గత కొన్ని రోజులుగా పట్టపగలు వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. గాయత్రీనగర్ లైబ్రరీ పార్కు, సున్నం చెరువు పార్కుల్లో రాత్రిపూట లైట్లు వెలగకపోవడంతో పార్కులకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ స్ట్రీట్‌లైట్ల విభాగం డీఈ, డివిజన్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ప్రాంతాల్లో స్ట్రీట్‌లైట్ల సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

బీఎస్పీకాలనీలో పగలు కూడా వెలుగుతున్న స్ట్రీట్‌లైట్లు

జై శ్రీరాం.. జై హనుమాన్

పలు ప్రాంతాల్లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి జోన్ల బృందం, జూన్1 : హనుమాన్ జయంతి వేడుకలు శనివారం కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల పరిధిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆయా ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి, సీతారాముల ఆలయాలను సందర్శించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజరంగదళ్, ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో పూరవీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. జైశ్రీరాం..జైహనుమాన్ నినాదాలతో హోరెత్తించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు, వివిధ పార్టీల నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పలు చోట్ల భక్తులకు అన్నవితరణతో పాటు బెల్లంపాన కాన్ని పంపిణీ చేశారు.

కూకట్‌పల్లిలోని శ్రీదాసంజనేయ స్వామి దేవాలయంలో కుటుంబ సమేతంగా కలిసి స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

బాలాజీనగర్‌లోని సంజీవని హనుమాన్ దేవాలయంలో ..

బాలానగర్‌లోని హనుమాన్ దేవాలయంలో..

షాపూర్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో భక్తులకు అన్నదానం..

అత్యవసర బృందాలు సిద్ధం

- **వర్షాకాలం విపత్తులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు**
- **కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ జడ్సీ అభిలాష**

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 1 : వర్షాకాలంలో ఎదురయ్యే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అత్యవసర బృందాలను సిద్ధం చేసినట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో ఐదు సర్కిళ్లకు చెందిన వర్షాకాలం అత్యవసర బృందాలు, వాహనాల సేవలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం కోసం ఎమర్జెన్సీ టీమ్‌లను సిద్ధం చేశామని, జోన్ పరిధిలోని 22 వార్డులకు...వార్డుకు ఒకటి చొప్పున 22 అత్యవసర బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. మూసాపేట సర్కిల్‌లో 5, కూకట్‌పల్లి సర్కిల్‌లో 6, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 4, గాజులరామారం సర్కిల్‌లో 4, అల్వాల్ సర్కిల్‌లో 3 అత్యవసర బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి వార్డుకు ఒక వాహనం అందుబాటులో ఉంటుందని, ఒక్కో వాహనంలో నలుగురు లేబర్, 1 డ్రైవర్‌తోపాటు పరికరాలు, పనిముట్లు ఉంటాయన్నారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు ముంపు సమస్యలు ఎదురైతే... వెంటనే అత్యవసర బృందాలు అక్కడకు చేరుకుని తక్షణమే సహాయక చర్యలు అందిస్తాయన్నారు. వర్షాలు లేనప్పుడు కాలనీలు, బస్తీల్లోని ప్రధాన మార్గాల్లో వర్షాలతో ఎర్పడిన గుంతలను పూడ్చడం, వర్షనీటి కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించడం లాంటి పనులు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి రోజు 2 టీమ్‌లు... 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందిస్తాయన్నారు. ఆయా సర్కిళ్ల వారీగా ఏర్పాటు చేసిన బృందాలు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఈ బృందాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, డీసీలు రమేశ్, కృష్ణయ్య, ఈఈలు సత్యనారాయణ, గోవర్ధన్, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో అత్యవసర బృందాలు, వాహన సేవలను ప్రారంభిస్తున్న జడ్సీ అభిలాష

డా.హుస్సేన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

దుండిగల్,జూన్ 1: సుభాశ్‌నగర్ డివిజన్, సూరారం కాలనీ సాయిబాబానగర్‌కు చెందిన పీపుల్స్ వైద్యశాల నిర్వాహకులు డా.హుస్సేన్‌కు జర్మనీకి చెందిన హాసన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఇందుకు సంబంధించిన అవార్డును శనివారం దేశ రాజధాని ఢిల్లీలోని హాలీడే ఇన్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో డా.హుస్సేన్‌కు అందజేశారు. డా. హుస్సేన్ గత కొంతకాలంగా మురికివాడల్లోని పేదలకు వైద్యసేవలు అందిస్తూ మంచిపేరు తెచ్చుకున్నారు. అదే విధంగా కమ్యూనిటీ పారామెడిక్స్ రాష్ట్ర అధ్యక్షుడిగాను పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా డా.హుస్సేన్ మాట్లాడుతూ.. తనకు హాసన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

అనుమతి లేని కళాశాలలను సీజ్ చేయాలి

కొండాపూర్, జూన్ 1 : అనుమతి లేని ఇంటర్ కాలేజీలను వెంటనే సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఇంటర్‌బోర్డును డిమాండ్ చేసింది. కొండాపూర్‌లో కొనసాగుతున్న అనుమతిలేని కాలేజీలకు నోటీసులతో సరిపెట్టడం సరికాదన్నారు. అరకొర సదుపాయాలు, సరైన బిల్డింగ్ అనుమతులు లేకుండా కాలేజీలను కొనసాగించవద్దంటూ ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాతో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాదికారి శ్రీదేవి కేవలం నోటీసులతో సరిపెట్టారన్నారు. అనుమతులు లేకుండా లక్షల్లో ఫీజులు గుంజుతూ, విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్న కళాశాలలను వెంటనే రద్దు చేయాలంటూ ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు డిమాండ్ చేశారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

బాస్కెట్‌బాల్ మాజీ కెప్టెన్ హరికృష్ణ ప్రసాద్

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 1 : జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బాస్కెట్‌బాల్ టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ జి.హరికృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాఠశాల దశలోనే విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. సమ్మర్ క్యాంపుల్లో ఇష్టమైన క్రీడలో నైపుణ్యాలను పెంపొందించుకుంటే...భవిష్యత్‌లో ఆ క్రీడలో ఉన్నతంగా రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. సెల్‌ఫోన్‌లు, టీవీలకు బానిసకావద్దని, రోజువారి జీవితంలో క్రీడలకు సమయాన్ని కేటాయించాలన్నారు. చదువులతో పాటు క్రీడలకు సమయాన్ని కేటాయించి ఉన్నతంగా ఎదగాలన్నారు. కాలనీలో విద్యార్థులకు క్రీడా నైపుణ్యాలను అందిస్తున్న కోచ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ కోచ్ అంజిబాబు, అసిస్టెంట్ కోచ్ చందు, కాలనీ అసోసియేషన్ నేతలు వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, బత్తుల హరిబాబు, అప్పారావు ఉన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో జీహెచ్ఎంసీ సమ్మర్ క్యాంప్‌లో చిన్నారులతో హరికృష్ణ ప్రసాద్, కోచ్ అంజిబాబు, తదితరులు

వికారాబాద్ రైల్వే ట్రాక్‌పై వ్యక్తి ఆత్మహత్య



మృతదేహం లభించిన డ్రైవింగ్ లైసెన్స్

దుండిగల్,జూన్1 : సుభాష్‌నగర్ డివిజన్, సూరారం కాలనీకి చెందిన ఓ వ్యక్తి శనివారం తెల్లవారుజామున వికారాబాద్‌లోని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడిన్నట్టు రైల్వే పోలీసులు గుర్తించారు. పోలీసులు తనిఖీలు చేయగా మృతదేహం వద్ద ఫొటోతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లభించింది. సూరారంకు చెందిన రాజుగా గుర్తించారు. అయితే ఇప్పటి వరకు సూరారం కాలనీలో కానీ సూరారం విలేజ్‌లో గానీ ఉన్నట్లుగా ఎవ్వరూ గుర్తించలేదు. మృతుడి వివరాలు ఎవరికైన తెలిస్తే ఫోన్: 9989355134కు సంప్రదించాలని వికారాబాద్ రైల్వే పోలీసులు కోరారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

జగద్గిరిగుట్ట, జూన్1 : అనుమతి లేకుండా భవనం నిర్మించడంతో పాటు స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు కోరారు. రంగారెడ్డినగర్ గిరినగర్‌లో చోటు చేసుకున్న ఘటనపై శనివారం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గిరినగర్‌లో గరిగె శేఖర్ అనే వ్యక్తి అనుమతిలేకుండా ఇంటి నిర్మాణం చేపట్టడంతోపాటు పక్కన ఉన్న స్థలాన్ని కొంతమేర ఆక్రమించాడు. స్థానికులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో గరిగె శేఖర్ ఇంటిపై శనివారం పనులు చేస్తుండగా కర్రలు పక్కన్న ఉన్న ఇంటిపై పడ్డాయి. దింతో సిమెంట్ రేకులు ధ్వంసమయ్యాయి. సమస్యపై అతన్ని ప్రశ్నిస్తే పక్కన ఉన్న స్థలం నాదేనని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దుర్గయ్య, యాకూబ్, శ్రీనివాస్, హరినాథరావు పాల్గొన్నారు.

హెచ్ఎంటీ కమాన్ పరిశీలన..

మాదాపూర్, జూన్ 1: మియాపూర్ హెచ్ఎంటీ కమాన్ వద్ద కాలనీ వాసులు చెత్తను వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతున్నది. దీంతో జీహెచ్ఎంసీ సిబ్బంది శనివారం ఆ స్థలాన్ని పరిశీలించి.. ప్రజలకు అవగాహన చేపట్టి చెత్తను వేయకుండా చర్యలు తీసుకున్నారు.